క్లుప్తంగా

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



బహుమతులు అందిస్తున్న ఎస్సై

రామకృష్ణాపూర్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా స్థానిక సీనియర్ క్రీడాకారులు, పీఈటీల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొత్తం నాలుగు మ్యాచ్‌లు నిర్వహించిన అనంతరం విజేతలకు పట్టణ ఎస్సై రాజశేఖర్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు మొండ్యాల శ్రీనివాస్, నూనె శ్రీనివాస్, డిప్పు శ్రీనివాస్, బెల్లం శ్రీనివాస్, రంజిత్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

వేమనపల్లి: నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చెన్నూర్‌రూరల్ సీఐ విద్యాసాగర్ అన్నారు. నీల్వాయి పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సై సుబ్బారావుతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతామని కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి వద్దే వేడుకలు జరుపుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. రోడ్లపై గుంపులు గుంపులుగా కేకలు వేస్తూ వాహనాలు ర్యాలీగా వెళ్లొద్దన్నారు. టపాకాయలు పేల్చడం, రోడ్లపై కేక్‌లు కట్ చేయడం, డీజేలు ఉపయోగించడం నిషేధమన్నారు. ఆయన వెంట ఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు.

లౌడ్‌స్పీకర్ అందజేత

వేమనపల్లి: మండలంలోని ముల్కలపేట ఎంపీయూపీఎస్ పాఠశాల అవసరాల నిమిత్తం జెడ్పీటీసీ స్వర్ణలత, ఎంపీటీసీ సంతోష్ కుమార్ ఆదివారం లౌడ్‌స్పీకర్ అందజేశారు.

జోరుగా కేక్‌ల విక్రయాలు

బెల్లంపల్లి: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఆదివారం బెల్లంపల్లిలో కేక్‌లు, మద్యం, మాంసాహారం అమ్మకాలు జోరుగా జరిగాయి. చిన్నారులు, యువకులు కేక్‌లకు ఆర్డర్ ఇచ్చి ప్రత్యేకంగా తయారు చేయించుకోగా అనేకమంది బేకరి షాపులకు రెడీమెడ్‌గా తయారు చేసిన కేక్‌లను కొనుగోలు చేసి తీసుకువెళ్లారు. అరకిలో, కిలో, రెండు, మూడు కిలోల చొప్పున వ్యాపారులు కేక్‌లను అమ్మకం కోసం తయారు చేయించారు. మద్యం విక్రయాలు కూడా ఆశాజనకంగా సాగాయి. 2023కు వీడ్కోలు పలికి, 2024 కొత్త సంవత్సరానికి స్వాగతం పలకడానికి యువకులు ప్రత్యేకంగా విందు కార్యక్రమాలు ఏర్పాటు చేసుకున్నారు.

నిరాశ్రయులకు చేయూత..!

- చలి నుంచి రక్షణకు దుప్పట్ల పంపిణీ



గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు..

దండేపల్లి: రోడ్ల వెంట ఉండే నిరాశ్రయులు, అటవీ ప్రాంతాలకు సమీపంగా నివసించే గిరిజనులు చలికాంలో చలి తీవ్రతను తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి సమయంలో నిరాశ్రయులకు, నిరుపేదలకు, గిరిజనులకు, కొందరు ట్రస్టుల ద్వారా, లయన్స్ క్లబ్‌లు, సేవా సమితుల ద్వారా అండగా నిలిచి, దుప్పట్లు పంపిణీ చేసి, చలి నుంచి రక్షణ కల్పిస్తున్నారు. వారిపై ప్రత్యేక కథనం...

తాళ్లపేటకు చెందిన కిరణ్..

మండలంలోని తాళ్లపేటకు చెందిన గుమ్మడి కిరణ్ కుమార్, హైదరాబాద్‌లో అష్టమాలజీగా పనిచేస్తుంటాడు. తన తండ్రి రాజలింగం పేరున ట్రస్టు స్థాపించాడు. ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు, చలికాలంలో నిరాశ్రయులకు, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నాడు.

లయన్స్ క్లబ్ ద్వారా..

దండేపల్లి మండల లయన్స్ క్లబ్‌ను మూడేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ ద్వారా ఏటా అనేక సేవా కార్యక్రమాలు, వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. చలికాలం వచ్చిందంటే చాలు నిరుపేదలకు చలి నుంచి రక్షణ కల్పించడం కోసం దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు.

నంబాలలో..

మండలంలోని నంబాలకు చెందిన తిరుపతి, అనే వ్యక్తి, లక్సెట్టిపేట శ్రీశివసాయి గణేష్ సేవాసమితి ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ, నంబాల గ్రామానికి చెందిన మరికొంతమంది సాయంతో గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. నంబాలకు చెందిన కొంతమందికి ఇటీవల చలి నుంచి రక్షణ కోసం దుప్పట్లు పంపిణీ చేశారు.



వృద్ధుడికి దుప్పటి అందిస్తున్న కిరణ్

తొమ్మిదేళ్లుగా పంపిణీ..



మా నాన్న రాజలింగం పేరున ట్రస్టు ఏర్పాటు చేశాను. తొమ్మిదేళ్లుగా, హైదరాబాద్ నగరంతో పాటు, దండేపల్లి, జన్నారం మండలాల్లోని నిరుపేద గిరిజనులకు ఏటా చలికాలంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నాను. సేవా కార్యక్రమాలతో పాటు, చలికాలంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నాను.

– గుమ్మడి కిరణ్, తాళ్లపేట

గిరిజనులు, నిరుపేదలకు..



దండేపల్లిలో మూడేళ్ల క్రితం లయన్స్ క్లబ్ ఏర్పాటు చేశాం. క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సేవా కార్యక్రమాలతో పాటు, మండలంలోని పలు గిరిజన గ్రామాల్లోని నిరుపేద గిరిజనులకు ఏటా చలి నుంచి రక్షణ కోసం దుప్పట్లు పంపిణీ చేస్తున్నాం.

– మల్లికార్జున్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు

క్రీడా ప్రాంగణ సామగ్రిని తొలగించారు..!



మండలంలోని హన్మంతుపల్లి గ్రామంలో రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా క్రీడా ప్రాంగణంలోని పరికరాలు అడ్డంగా ఉన్నాయని వాటిని తొలగించారు. ప్రభుత్వం ప్రజల కోసం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలోని సామగ్రిని తొలగించడంపై పలువురు మండిపడుతున్నారు. యువకులకు ఉపయోగకరంగా ఉండాల్సిన క్రీడా సామగ్రిని తొలగించడం సరికాదని మండిపడుతున్నారు. క్రీడా సామగ్రిని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– లక్సెట్టిపేట

షిర్డీ సాయిబాబా పల్లకి సేవలో బెల్లంపల్లి భక్తులు



సాయిబాబా పల్లకి మోస్తున్న భక్తులు

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన షిర్డీ సాయిబాబా భక్తులు ఆదివారం పల్లకి సేవలో తరించారు. ప్రత్యేక వాహనాల్లో దాదాపు 300మంది భక్తులు షిర్డీ వెళ్లారు. భక్తి పారవశ్యంతో పాటలు పాడుతూ, భాజభజంత్రీలతో పల్కి నివార్ నుంచి కండోబా ఆలయం మీదుగా పల్లకితో షిర్డీ సాయిబాబా దేవాలయానికి చేరుకున్నారు. ఏటా మాదిరిగానే ఈ సారి కూడా పల్లకి సేవకు వెళ్లినట్లు భక్తులు తెలిపారు. అనంతరం సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి షిర్డీ సాయిబాబా ఆలయ చైర్మన్ ఆవునూరి దుర్గయ్య, కమిటీ సభ్యులు కుప్పుస్వామి, కుంబాల రాజేష్, దత్తు, శ్రీనివాసా చారి, అన్వేష్, చరణ్, సాయిశ్వర్, అజయ్, మహిళలు పాల్గొన్నారు.

దరఖాస్తు ఫారాల అందజేత



దరఖాస్తులు అందజేస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్

చెన్నూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజాపాలనలో భాగంగా మండలంలోని పొక్కూరు గ్రామంలో ఆదివారం ఇంటింటికీ తిరిగి దరఖాస్తు ఫారంలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుక్కడపు నరేందర్, ఉప సర్పంచ్ గద్దె శ్రీలత,మధుకర్‌రెడ్డి, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, కోడెల రాజేశ్వరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ శ్రేణుల విజయోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ శ్రేణులు

బెల్లంపల్లి: సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఘన విజయం సాధించడాన్ని పురస్కరించుకుని ఆదివారం బెల్లంపల్లిలో ఏఐటీయూసీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ బజారు ఏరియా పురవీధుల మీదుగా కాంటా చౌరస్తా వరకు నిర్వహించారు. ఎర్రజెండాలు చేత పట్టుకుని పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ కామ్రేడ్స్ ర్యాలీలో పాల్గొన్నారు. బజారు ఏరియాలో స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్, దివంగత సీపీఐ నేత గుండా మల్లేష్ విగ్రహాలకు, కాంటా చౌరస్తా వద్ద భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి కార్మిక నేతలు పూలమాల వేసి విప్లవ జోహార్లు అ ర్పించారు. కాంటా చౌరస్తాలో జరిగిన సభలో నాయకులు మాట్లాడారు. గుర్తింపు ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను ఏఐటీయూసీ నెరవేరుస్తుందని అన్నారు. సింగరేణి ఎన్నికల్లో ఆదరించి విజయాన్నీ అందించిన కార్మిక వర్గానికి విప్లవ జేజేలు తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఎం. వెంకటస్వామి, బెల్లంపల్లి బ్రాంచ్ ఇంచార్జీ చిప్ప నర్సయ్య, బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బి.పూర్ణిమ, బెల్లంపల్లి పట్టణ, మండల సీపీఐ కార్యదర్శులు ఆడేపు రాజమౌళి, బొంతల లక్ష్మీనారాయణ, కాసిపేట, శాంతిఖని ఫిట్ సెక్రెటరీలు మీనుగు లక్ష్మీనారాయణ, తిరుపతి గౌడ్, నాయకులు బి.వెంకటస్వామి, రత్నం ఐలయ్య, రాంచందర్, ఉపేందర్, కార్మికులు, కామ్రేడ్స్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఇబ్బందులపై షార్ట్‌ఫిల్మ్



షార్ట్ ఫిల్మ్ ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

జన్నారం: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించడంతో ఆటో డ్రైవర్లు, యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆదివారం ఆదర్శ కళాసమితి ఆధ్వర్యంలో షార్ట్ ఫిల్మ్ ప్రారంభించారు. ఈ షార్ట్ ఫిల్మ్‌ను జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆటో డ్రైవర్లు, యజమానులు గిరాకీలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి జీవితాలపై ఆదర్శ కళా సమితి షార్ట్ ఫిల్మ్ తీయడం అభినందనీయం అన్నారు. షార్ట్‌ఫిల్మ్‌కు ఆదర్శ కళాసమితికి తనవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ జిల్లా డైరెక్టర్ భరత్‌కుమార్, ఆదర్శ కళాసమితి అధ్యక్షుడు లింగంపల్లి రాజలింగు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

షెడ్డు కూల్చివేత అన్యాయం

శ్రీరాంపూర్: నస్పూర్ కాలనీలో అనిల్‌కుమార్ అనే కార్మికుడు తన క్వార్టర్ ముందు షెడ్డు నిర్మించుకుంటే సింగరేణి ఎస్అండ్‌పీసీ సెక్యూరిటీ సిబ్బంది వెళ్లి కూల్చివేయడం అన్యాయమని ఏఐటీయూసీ కేంద్ర డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరబద్రయ్య, సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచీ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఉపాధ్యక్షుడు కిషన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులకు కేటాయించిన క్వార్టర్లలో కుటుంబం అంతా ఉండటానికి ఇరుకుగా ఉంటుందని, కావున ముందు స్థలంలో షెడ్డు కట్టుకోవడం సముచితమన్నారు. దీ న్ని అధికారులు సిబ్బందిని పంపి దౌర్జన్యంగా కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇకనైనా ఆ కార్మికుడిని ఇబ్బంది గురి చేయొద్దన్నారు.

తీవ్రంగా ఖండిస్తున్నాం..

కార్మికుడు నిర్మించుకుంటున్న షెడ్డును అధికారులు కూల్చివేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జే.శంకర్‌రావు, టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ సభ్యులు పెట్టం లక్ష్మణ్ వేరువేరుగా విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. తాము గుర్తింపు సంఘంగా ఈ సమస్యలపై గతంలో యాజమాన్యంతో చర్చించి షెడ్డు నిర్మించుకుంటే ఇబ్బందులకు గురి చేయొద్దంటే అధికారులు దానికి ఒప్పుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు ఎన్నికలు జరిగిన కొద్ది రోజులకే అధికారులు ఇలాంటి ఘటనలకు పాల్పడడం అన్యాయమన్నారు. వెంటనే బాధిత కార్మికుడికి న్యాయం చేయాలని, పనులను అడ్డుకోవద్ద కోరారు.

ఘనంగా నూతన సంవత్సర స్వాగత వేడుకలు



కేక్ కట్ చేస్తున్న గుర్రాల శ్రీధర్

మంచిర్యాలక్రైం: అంజనిపుత్ర సంస్థ ఆధ్వర్యంలో జైపూర్ మండలం దుబ్బపల్లిలోని డైమండ్ సిటీ వేదికగా ఆదివారం నూతన సంవత్సర స్వాగత వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంజనిపుత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గుర్రాల శ్రీధర్ మాట్లాడుతూ.. గత ఏడాదిలో వ్యాపార, వ్యక్తిగత జీవితాల్లో ఎన్నో లోటుపాట్లను అధిగమించి నూతన సంత్సరంలో అడుగు పెట్టబోతున్నామని, నూతన సంవత్సరంలో వ్యాపారంలో ఉన్నత శిఖరాలను అధిగమించేందుకు కావాల్సిన లక్ష్యాలను ఎంచుకోవాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేసి టపాసులు కాల్చుతూ సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అంజనిపుత్ర ఎండీ పిల్లి రవి, సంస్థ ఎక్సిక్యూటివ్ డైరెక్టర్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కొత్త టెక్నాలజీతో రోడ్డు మరమ్మతు



బ్రిడ్జిపైన డాంబర్ షీట్లు స్టిక్ చేస్తున్న లేబర్లు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రోడ్డు మరమ్మతుకు అధికారులు ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. వంతెనపై భారీ గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. గతంలో చేపట్టిన మరమ్మతులతో సమస్య పరిష్కారం కాలేదు. నాసిరకం పనులతో ప్యాచ్ వర్క్ తరచూ చెదిరిపోతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావ్ ఆధునిక టెక్నాలజీతో గుంతలు పూడ్చేలా చర్యలు చేపట్టా రు. ఈమేరకు చెన్నై నుంచి డాంబర్ షీట్లు తెప్పించారు. వాటిని వేయడానికి గ్యాస్ సిలిండర్లతో రో డ్డును, డాంబర్‌షీట్‌ను ఒకేసారి వేడిచేస్తూ రోడ్డుపై స్టిక్ చేస్తున్నారు. ఈ పని చేయడానికి బిహార్, చెన్నై నుంచే వర్కర్లను పిలిపించారు. ఈ పనులను



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

ఆది వారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పరిశీలించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో తాత్కాలిక మరమ్మతులతో సమస్య పరిష్కారం కాలేదన్నారు. కొత్త టెక్నాలజీతో చేపట్టిన పనులతో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. డాంబర్ షీట్ల కోసం రూ.15 లక్షలు ఖర్చు చేశామన్నారు.

ఘనంగా శ్రీరామ అక్షింతల శోభాయాత్ర



బుగ్గగట్టు వద్ద స్వాగతం పలుకుతున్న భక్తులు



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



లక్సెట్టిపేటలో...

బెల్లంపల్లిరూరల్: మండలంలోని చంద్రవెల్లిలో అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చేరుకున్న అక్షింతలను ఆదివారం శ్రీ అన్నపూర్ణ సహిత సోమేశ్వర ఆలయం వద్ద పల్లకిలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో ముందు నడవగా యువకులు జైశ్రీరామ్ నినాదాలతో నృత్యాలు చేస్తూ వాడల్లో శోభాయాత్రను అట్టహాసంగా చేపట్టారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఇంటింటికి తలంబ్రాలు

లక్సెట్టిపేట: అయోధ్య శ్రీరాముల తలంబ్రాలను మండల కేంద్రంలోని హన్మాన్ ఆలయం నుంచి మండలంలోని ఇంటింటికీ ధర్మ జాగరణ పరియోజన సభ్యులు పంపిణీ చేశారు. అయోధ్య రామమందిరం ప్రజలతో నిర్మించబడిందని, ప్రతి ఇంటికీ తలంబ్రాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

హాజీపూర్‌లో...

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామ మందిర అక్షింతలు ఆదివారం హాజీపూర్ మండలానికి చేరుకున్నాయి. శ్రీరామ అక్షింతలకు బుగ్గగట్టు వద్ద మంగళహారతులతో పాటు భజనలు, కోలాటాలతో భక్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల సమయోజక్ బొలిశెట్టి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పూస్కూరి శ్రీనివాసరావు, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మండల కన్వీనర్ ఏనుగు చంద్రశేఖర్‌రెడ్డి, రాపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు నామని రాజేశం, పడ్తనపల్లి అధ్యక్షుడు మడిపెల్లి సత్యం, కర్ణమామిడి అధ్యక్షుడు బొడ్డు శంకర్, హాజీపూర్ అధ్యక్షుడు కుమ్మరి సత్తయ్య, నర్సింగాపూర్ అధ్యక్షుడు లగిశెట్టి వెంకటి, సభ్యులు కందుల రమేశ్, చింతకింది మధుసూధన్ పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో...



నస్పూర్ కాలనీలో నృత్యం చేస్తున్న చిన్నారులు



మంచిర్యాల జిల్లా కేంద్రంలో...



సీసీసీలో కుర్చీలాటలు ఆడుతున్న చిన్నారులు



బెల్లంపల్లి: సీఓఈలో విద్యార్థులతో ప్రిన్సిపాల్



జిల్లా కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో...

న్యూ ఇయర్ సంబురం..!

శ్రీరాంపూర్/నస్పూర్/దండేపల్లి/బెల్లంపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): 2023 సంవత్సరానికి ఉత్సాహంగా వీడ్కోలు పలుకుతూ.. 2024నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని కోరుకుంటూ ప్రజలు కొత్త సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రి సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేసుకుని డ్యాన్స్‌లు చేస్తూ సందడిగా చేశారు. చిన్నారులు, యువతీ, యువకులు, పెద్దలు కేక్‌లు కట్ చేసి సంబురంగా గడిపారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకుంటూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో చిన్నారులు, యువతులు, మహిళలు వారి ఇళ్ల లోగిళ్ల ఎదుట వేసిన అందమైన ముగ్గులు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. హాజీపూర్ మండలంలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో న్యూ ఇయర్ వేడుకల జోష్ సందడిగా సాగింది.



దండేపల్లి: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...



శ్రీరాంపూర్: సీసీసీ రాయల్‌టాకీస్ వద్ద...



బెల్లంపల్లి బస్తీలోని ఆసుపత్రి ఎదుట...

మల్లన్న బోనాలు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గంపలపల్లి గ్రామ శివారులోని అందుగుల మల్లన్న గుడి వద్ద ఆదివారం మల్లన్న బోనాలు ఘనంగా జరుపుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.